సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం। 14। మార్చి। 2023



క్షయ,కుష్టులపై అప్రమత్తం

క్షయ,కుష్టులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ,కుష్టు,ఎయిడ్స్ వ్యాధుల నివారణ అధికారి విశ్వేశ్వరనాయుడు అన్నారు. 8లో



'నులి'మేద్దాం!

పిల్లల్లో రక్తహీనతకు కారణమవుతున్న నులిపురుగుల నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వం సన్నద్ధమైంది. 8లో



చిరుధాన్యాలతో అపు'రూపాలు'

వృత్తిరీత్యా విజయ్‌కుమార్ రైల్వే ఉద్యోగి. చిరుధాన్యాలతో అపురూప చిత్రాలు వేస్తూ ఆకట్టుకుంటున్నాడు. 8లో

న్యూస్‌రీల్

పదిలో ఉత్తమ ఫలితాల సాధనే లక్ష్యం

రాష్ట్ర గురుకుల అసిస్టెంట్ సెక్రటరీ శేషయ్య



సరకుల నిల్వలు పరిశీలిస్తున్న శేషయ్య

రాజవొమ్మంగి: ఉత్తమ ఫలితాల సాధనే టెన్త్ విద్యార్థుల లక్ష్యంకావాలని, ఉన్నత విద్యన భ్యసించాలంటే పదవ తరగతిలో మంచి మార్కులు పొందాలని రాష్ట్ర గురుకుల అసిస్టెంట్ సెక్రటరీ బి.శేషయ్య తెలిపారు. ఆయన సోమవారం స్థానిక గిరిజన బాలికల గురుకుల పాఠశాల, రాజవొమ్మంగి, అడ్డతీగలలోని ఏకలవ్య పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు,సరకుల నిల్వలు పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ప్రిన్సిపాళ్లు ఎం.వి.కృష్ణారావు, ఎం.వి.ఫణి కుమార్, సత్యవేణిలను ఆయన ఆదేశించారు. విలేకరులతో మాట్లాడుతూ చింతూరు, రంపచోడవరం ఐటీడీఏల పరిధిలో ఉన్న ఏడు గురుకుల పాఠశాలల్లో సుమారు ఐదు వేల మంది విద్యార్థుల ఈ ఏడాది టెన్త్ పరీక్షలు రాయనున్నట్టు చెప్పారు.

స్పందనలో 51 అర్జీల స్వీకరణ



అర్జీలు స్వీకరిస్తున్న ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే

రంపచోడవం: స్థానిక ఐటీడీఏ సమావేశం హాల్లో సోమవారం నిర్వహించిన స్పందనలో 51 అర్జీలు స్వీకరించారు. రంపచోడవరం ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే, ఏపీవో జనరల్ సీహెచ్ శ్రీనివాసరావు స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ స్పందనలో కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించినట్టు చెప్పారు. వై.రామవరం మండలంలోని గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఎంపీపీ కడబాల ఆనంద్, జెడ్పీటీసీ కర్రా వెంకటలక్ష్మి, వైస్ఎంపీపీ ముర్ల జోగిరెడ్డి అర్జీ అందజేశారు. చింతలపూడి పంచాయతీకి రబ్బరు మొక్కలు సరఫరా చేయాలని సర్పంచ్ పల్లాల సన్యాసమ్మ, పల్లాల లచ్చిరెడ్డి దరఖాస్తు అందజేశారు.చావడికోటలో కుళాయి పైపులు ఏర్పాటు చేయాలని సర్పంచ్ సాదల ప్రేమ్ కుమార్ రెడ్డి పీవోను కోరారు.

అసెంబ్లీ సమావేశాలకు ఎమ్మెల్యేలు

సాక్షి, పాడేరు: అసెంబ్లీ సమావేశాలకు జిల్లాలోని ఎమ్మెల్యేలు సోమవారం తరలివెళ్లారు. మంగళవారం నుంచి జరిగే సమావేశాలకు పాడేరు,అరకులోయ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి,చెట్టి పాల్గుణలు ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియను సమీక్షించిన అనంతరం తమ వాహనాల్లో విజయవాడకు బయలుదేరారు. రంపచోడవరం ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి కూడా అసెంబ్లీ సమావేశాలకు తరలివెళ్లారు.

విజయవంతంగా డీవార్మింగ్ డే



అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న డీఎంహెచ్‌వో జమాల్ బాషా

సాక్షి,పాడేరు: డీవార్మింగ్‌డేను పురస్కరించుకుని మంగళవారం జిల్లాలోని అన్నివిద్యాలయాల్లో డీవార్మింగ్ మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ జమాల్‌బాషా తెలిపారు.చింతలవీధి,సేరిబయలు అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు ఏపీఆర్ పాఠశాలను సోమవారం ఆయన సందర్శించి ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బందికి డీవార్మింగ్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. 14న ఈ కార్యక్రమానికి దూరమైన విద్యార్థులకు 18న మాత్రలు పంపిణీ చేయాలని సూచించారు. హెల్త్ అసిస్టెంట్ శెట్టి నాగరాజు పాల్గొన్నారు.

నేడు నాలుగు మండలాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేత

పెదబయలు: జంగిల్ క్లియరెన్స్ పనుల కారణంగా పాడేరు, హుకుంపేట, పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల్లో మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు పాడేరు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.వి.ఎస్.ఎం. అప్పారావు తెలిపారు. పాడేరు విద్యుత్ ఉప కేంద్రంలో నిర్వహణ,పాడేరు,పెదబయలు,హుకుంపేట, ముంచంగిపుట్టు మండలాల మీదుగా వెళ్లే 33 కేవీలైన్‌పై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు,చిన్నపాటి మరమ్మతుల చేయడానికి 14తేదీ ఉదయం10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

ఓటెత్తిన పట్టభద్రులు

ఎండను సైతం లెక్కచేయకుండా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌కు పట్టభద్రులు పోటెత్తారు. ఉదయం 8 గంటల నుంచే భారీ సంఖ్యలో కేంద్రాలకు తరలివచ్చి ఓటు ప్రాధాన్యతను తెలిపారు. బ్యాలెట్ పేపర్ భారీ సైజులో ఉండటంతో ఓటు వేయడానికి ఒక్కో ఓటరుకు చాలా సమయం పట్టింది. అయినప్పటికీ పట్టభద్రులు సహనం కోల్పోలేదు. పోలింగ్ సమయం ముగిసిన తర్వాత కూడా క్యూలో నిల్చుని ఓటేసి కానీ వెనుదిరగలేదు. పురుషులతోపాటు మహిళా పట్టభద్రులూ పెద్దఎత్తున ఓటింగ్‌లో పాల్గొన్నారు. దీంతో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో 69.21 శాతం పోలింగ్ నమోదైంది.

- పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్ల జోరు
- ఉదయం నుంచే కేంద్రాల వద్ద రద్దీ
- సాయంత్రం 4 తర్వాత భారీ క్యూలు
- ఆవరణలో ఉన్న అందరికీ ఓటేసే అవకాశం
- 16న కౌంటింగ్, గెలుపుపై ఎవరి అంచనాలు వారివే..
- 69.21 శాతం పోలింగ్ నమోదు



ఓటు వేసేందుకు హుకుంపేటలో క్యూలో నిల్చున్న ఓటర్లు

ఉత్తరాంధ్ర గ్రాడ్యుయేట్స్ ఎన్నికల్లో పోలైన ఓట్లు ఇలా..

జిల్లా పేరు	మొత్తం ఓటర్లు	పోలైన ఓట్లు	పోలింగ్ శాతం
శ్రీకాకుళం	52,256	37,417	71.60
విజయనగరం	58,502	43,862	74.98
పార్వతీపురం మన్యం	18,520	13,619	73.54
అల్లూరి సీతారామరాజు	11,525	8,362	72.56
విశాఖపట్నం	1,05,697	65,472	61.94
అనకాపల్లి	42,714	31,442	73.61
మొత్తం	2,89,214	2,00,174	69.21



రిటర్నింగ్ అధికారి, విశాఖ కలెక్టర్ మల్లికార్జున

సాక్షి, విశాఖపట్నం : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ సోమవారం ప్రశాంతంగా ముగిసింది. పట్టభద్రులు భారీగా కదిలిరావడంతో అంచనాలకు మించి రికార్డుస్థాయిలో ఓటింగ్ నమోదైంది. ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో ఉన్న 37 మంది అభ్యర్థుల భవితవ్యం బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైంది. ఆది నుంచి ఓటమి భయంతో అడ్డగోలుగా వ్యవహరిస్తున్న టీడీపీ, బీజేపీ శ్రేణులు.. పోలింగ్ రోజున కూడా అదే తీరుని కనబరిచారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ అనేక పోలింగ్ బూత్‌ల వద్ద తమ మద్దతు అభ్యర్థుల ఫొటోలు, పేర్లతో ఉన్న కరపత్రాలతో ప్రచారం నిర్వహించారు. ఓటర్లను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. మొత్తంగా ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఉత్తరాంధ్రలో 69.21 శాతం, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 69.37 శాతం పోలింగ్ నమోదైంది. మంత్రి అమర్‌నాథ్, మేయర్ గొలగాని హరివెంకటకుమారి, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణతో సహా ప్రజాప్రతినిధులు, అధికారులు ఓటు హక్కు వినియోగించుకున్నారు. కాగా ఈనెల 16న కౌంటింగ్ జరగనుంది.

మందకొడిగా మొదలై..

సోమవారం ఉదయం 8 గంటల నుంచి జిల్లాలో పోలింగ్ ప్రక్రియ నెమ్మదిగా సాగింది. 9 గంటలకు కార్యాలయాలకు, విధులకు వెళ్లే ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు పోలింగ్ కేంద్రాలకు తరలిరావడంతో ఓటింగ్ క్రమంగా ఊపందుకుంది. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటు వేసేందుకు బారులు తీరారు. పర్మిషన్స్ తీసుకొని ఉద్యోగులు, ప్రైవేట్ ఉద్యోగులు తరలిరావడంతో మధ్యాహ్నం నుంచి ఓటింగ్ ఒక్కసారిగా ఊపందుకుంది. అనంతరం.. సాయంత్రం సమయంలోనూ అదే రీతిలో పట్టభద్రులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు కేంద్రాలకు చేరుకున్నారు. నిబంధనల మేరకు 4 గంటలలోపు కేంద్రాలకు వచ్చిన వారికి మాత్రమే ఓటు వేసేందుకు అనుమతించారు. వారికి ప్రత్యేకంగా నంబర్లు కేటాయించి.. ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం కల్పించారు. 4 గంటల తర్వాత కూడా ఓటు వేసేందుకు చాలా మంది వచ్చినా గేట్లు మూసివేయడంతో నిరాశగా వెనుదిరిగారు. మొత్తంగా ఉదయం నుంచి ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా.. ఇబ్బందులు తలెత్తకుండా పోలింగ్ ప్రశాంతంగా సాగింది. మొత్తంగా ఉమ్మడి విశాఖ జిల్లాలో రాత్రి 8 గంటల వరకూ పోలింగ్ నిర్వహించారు. ఓటర్లు ఇబ్బందులు పడకుండా కొన్ని కేంద్రాల్లో జనరేటర్లు ఏర్పాటు చేశారు.

నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ డా.మల్లికార్జున పోలింగ్ సరళిని నిరంతరం పర్యవేక్షించారు. ఎప్పటికప్పుడు ప్రతి పోలింగ్ స్టేషన్ పరిధిలో జరుగుతున్న ఓటింగ్‌ను వెబ్‌క్యాస్టింగ్ ద్వారా పరిశీలించారు. పలు కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి ఓటర్లతో మాట్లాడి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. ఎన్నికల పరిశీలకులు సిద్ధార్థ్ జైన్‌తో కలిసి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నుంచి పర్యవేక్షించారు. ఎక్కడ ఏ చిన్న సమస్య తలెత్తినట్లు కనిపించినా.. వెంటనే సంబంధిత స్టేషన్ అధికారులకు సూచనలందించారు.

ప్రతిపక్షాల ఉల్లంఘనలే..

సాధారణంగా ఎన్నికలు జరిగినప్పుడు అధికారంలో ఉన్న పార్టీ కాస్తా దూకుడుగా వ్యవహరిస్తుంటుంది. కానీ.. ఎమ్మెల్సీ ఎన్నికల్లో మాత్రం పూర్తి విరుద్ధంగా కనిపించింది. పోలింగ్ కేంద్రాల్లో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు, మద్దతుదారులు సంయమనంగా వ్యవహరించారు. ఓటర్లకు స్లిప్పులు అందించడం.. వారికి పోలింగ్ బూత్‌ల వివరాలు తెలపడం వరకు మాత్రమే పరిమితమయ్యారు. కానీ.. టీడీపీ, బీజేపీ, పీడీఎఫ్ మాత్రం ఏ పోలింగ్ స్టేషన్ వద్ద చూసినా ఎన్నికల నిబంధనలను తుంగలో తొక్కారు. తమ అభ్యర్థికి ఓటు వేయాలంటూ.. టీడీపీ ఏజెంట్లు, అనుచరులు ఓటర్లను చివరి నిమిషం వరకూ ప్రలోభ పెట్టేందుకు ప్రయత్నించారు. కరపత్రాలు చేతిలో పట్టుకొని.. అభ్యర్థి ఫొటో, సీరియల్ నంబర్ చెబుతూ కండువాలతో హడావిడి చేశారు. అదేవిధంగా.. బీజేపీ ఏజెంట్లు, అనుచరులు ఏకంగా ప్లకార్డులు పట్టుకొని పోలింగ్ కేంద్రాల వద్ద ఏర్పాటు చేసిన టెంట్ల వద్ద ప్రదర్శనలు నిర్వహించారు. పీడీఎఫ్ అభ్యర్థులు కూడా అదే బాటలో పయనించారు.

స్ట్రాంగ్ రూమ్‌లో బ్యాలెట్ బాక్సులు

పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులకు సీల్ వేసి.. పోలీసు భద్రత నడుమ ఎన్నికల అధికారులు, సిబ్బంది కలిసి ప్రత్యేక వాహనాల్లో స్ట్రాంగ్ రూమ్‌కు తరలించారు. స్వర్ణ భారతి ఇండోర్ స్టేడియంలో ఆయా జిల్లాలకు కేటాయించిన స్ట్రాంగ్‌రూమ్స్‌లో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచారు. అర్ధరాత్రి ఒంటిగంట వరకూ కొన్ని ప్రాంతాల నుంచి బాక్సులు వచ్చాయి. ఈ ప్రక్రియను రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ డా.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్, జేసీ కేఎస్ విశ్వనాథన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ పర్యవేక్షించారు.



కలెక్టరేట్‌లో వెబ్‌కాస్టింగ్‌లో పోలింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్ కుమార్



చింతపల్లిలో తనిఖీ చేస్తున్న ఐటీడీఏ పీవో రోణంకి గోపాలకృష్ణ



ముంచంగిపుట్టు, హుకుంపేటల్లో చంటిపిల్లలతో పోలింగ్ కేంద్రాలకు వచ్చిన మహిళలు



పాడేరులో తొలిసారి ఓటు వేసిన పట్టభద్రులు బొయిన లక్ష్మి,బొయిన విజయకుమారి



పాడేరులోని పోలింగ్ బూత్‌లోని బ్యాలెట్ బాక్స్‌లో ఓటు వేస్తున్న పట్టభద్రుడు



దుంబ్రిగుడలో బందోబస్తు నిర్వహిస్తున్న ఎస్‌ఐ సంతోష్‌కుమార్

పాడేరు డివిజన్‌లో ఓటింగ్ వివరాలు

పోలింగ్ కేంద్రం	బూత్ నం.	ఓటర్లు	పోలైనవి
ముంచంగిపుట్టు	146	1,059	777
పెదబయలు	147	1,186	817
హుకుంపేట	148	900	615
హుకుంపేట	148ఏ	814	581
దుంబ్రిగుడ	151	912	652
అరకులోయ	149	945	755
అరకులోయ	150	874	641
అనంతగిరి	152	633	497
పాడేరు	153	780	572
పాడేరు	154	660	487
జి.మాడుగుల	155	637	461
చింతపల్లి	161	1,021	646
జీకే వీధి	162	384	301
సీలేరు	163	56	46
కొయ్యూరు	164	664	514

తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌కు బ్యాలెట్ బాక్స్‌లు

సీళ్లను పరిశీలించిన కలెక్టర్ సుమిత్‌కుమార్



బ్యాలెట్ బాక్స్‌లను పరిశీలిస్తున్న కలెక్టర్

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్‌ను ప్రశాంతంగా నిర్వహించిన ఎన్నికల అధికారులు ఆయా బ్యాలెట్ బాక్స్‌లు,ఇతర మెటీరియల్‌ను ఆర్టీసీ బస్సుల్లో సోమవారం రాత్రికి సురక్షితంగా పాడేరు చేర్చారు.15పోలింగ్ కేంద్రాలకు సంబంధించి ఐదురూట్లలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ బస్సుల్లో పోలింగ్ సామగ్రిని పాడేరు డిస్ట్రిబ్యూషన్,రిసెప్షన్ సెంటర్లకు తరలించారు. కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆ బ్యాలెట్ బాక్సుల సీళ్లను పరిశీలించారు.ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించిన అధికారులను,పోలీసుశాఖను కలెక్టర్ అభినందించారు.బ్యాలెట్ బాక్సులను తాత్కాలిక స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి, సీలు వేశారు.స్ట్రాంగ్ రూమ్ ఆవరణలో భద్రత ఏర్పాటు చేశారు.

పాడేరు డివిజన్‌లో ఓటింగ్ 72.56 శాతం

- ప్రశాంతంగా జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ పోలింగ్
- అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద బారులు తీరిన పట్టభద్రులు



ఓటు హక్కు వినియోగించుకున్నట్టు వేలు చూపుతున్న అరకు ఎంపీ మాధవి, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర పట్టభద్రుల శాసనమండలి ఎన్నికల పోలింగ్ సోమవారం పాడేరు డివిజన్‌లోని 15 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంతంగా జరిగింది. డివిజన్‌లో 11,525 మంది ఓటర్లు ఉండగా, 8,362 మంది తమ ఓటు హక్కును వినియోగించుకోవడంతో 72.56శాతం పోలింగ్ నమోదైంది. అత్యధికంగా జీకే వీధి మండలం సీలేరు పోలింగ్ బూత్‌లో 82.14 శాతం ఓటింగ్ నమోదు కాగా, తక్కువగా చింతపల్లి పోలింగ్ కేంద్రంలో 63.27 శాతం ఓటింగ్ నమోదైంది. కలెక్టర్ సుమిత్ కుమార్ పర్యవేక్షణలో ఐదు రూట్ల ప్రత్యేకాధికారులు, జోనల్ అధికారులు,రూట్ అధికారులు, పోలింగ్ కేంద్రాల పీవోలు,ఏపీవోలు పోలింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. జిల్లా కేంద్రమైన పాడేరులోని సుండ్రుపుట్టు ఎంపీపీ పాఠశాలలో ఏర్పాటు చేసిన 153,154 నంబర్ల పోలింగ్ కేంద్రాల్లో ఉదయం 8గంటల నుంచే పోలింగ్ ప్రారంభమైంది. అన్ని మండలాల్లోని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను అధికారులు నిర్ణీత సమయానికే ప్రారంభించారు. పోలింగ్ ఏజెంట్ల సమక్షంలో బ్యాలెట్ బాక్సులను తెరిచి, పరిశీలన అనంతరం వాటికి సీళ్లు వేసి, ఓటింగ్‌ను ప్రారంభించారు. డివిజన్‌లో మధ్యాహ్నం 2గంటల వరకు ఓటర్లు బారులు తీరారు. సాయంత్రం 4గంటల వరకు ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వస్తూనే ఉన్నారు.

సమయం దాటినా ఓటింగ్‌కు అనుమతి

డివిజన్‌లో పెదబయలు,ముంచంగిపుట్టు,హుకుంపేట,దుంబ్రిగుడ,అరకులోయలోని పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం నాలుగు దాటాక కూడా క్యూలైన్‌లో ఉన్న పట్టభద్రులకు ఓటు వేసే అవకాశాన్ని కల్పించారు. 7,861 మంది పురుష ఓటర్లకు గాను 5,951మంది, మహిళలు 3,661మందికి గాను 2,441మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు.ఇతరులు ముగ్గురు మాత్రం ఓటింగ్‌కు రాలేదు.

భారీ బందోబస్తు

పోలింగ్ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలింగ్ బూత్‌ల వద్ద భారీ బందోబస్తు నిర్వహించారు.

విస్తృతంగా పర్యవేక్షణ

కలెక్టర్ సుమిత్ కుమార్ ఉదయం 6గంటల నుంచే ఎన్నికల విధుల్లో ఉన్నారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌తో పాటు వెబ్ కాస్టింగ్ ద్వారా డివిజన్‌లోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించారు. పాడేరులోని రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు,హుకుంపేటలోని రెండు పోలింగ్ కేంద్రాలను కలెక్టర్ సందర్శించి, పోలింగ్ తీరును పరిశీలించారు. పోలింగ్ సరళిని ప్రతి గంటకు తెలుసుకుని ఎన్నికల కమిషన్‌కు నివేదికలు పంపారు. ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతంగా నిర్వహించడంపై ఐదు రూట్‌ల అధికార యంత్రాంగాన్ని కలెక్టర్ సుమిత్ కుమార్ అభినందించారు.

ఓటు వేసిన ఎంపీ, పాడేరు ఎమ్మెల్యే

ఎమ్మెల్సీ ఎన్నికల్లో అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నరసింగరావు, జెడ్పీ చైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ఇతర ప్రజాప్రతినిధులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. కొయ్యూరులో ఎంపీ మాధవి, పాడేరులోని సుండ్రుపుట్టు 154బూత్‌లో ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి దంపతులు ఓటు హక్కువినియోగించుకున్నారు. అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ హుకుంపేట,అరకులోయ,అనంతగిరి మండలాల్లో పర్యటించి, ఓటింగ్ సరళిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. రాష్ట్ర ఎస్టీసెల్ అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి జి.మాడుగులలో ఓటు వేసిన అనంతరం జీకే వీధిలో ఓటింగ్ సరళిని పరిశీలించారు.



ఓటు వేసిన ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి,డాక్టర్ నరసింగరావు



అరకులోయలో ఓటర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ



అనంతగిరిలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న జేసీ శివశ్రీనివాస్

ఆర్టీసీ రయ్..రయ్

- సేవల విస్తరణకు ప్రభుత్వం చర్యలు
- పాడేరు డిపోకు మరిన్ని బస్సులు
- సీలేరులో శాటిలైట్ డిపో
- జిల్లా ప్రజలకు పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యమే లక్ష్యం

సాక్షి,పాడేరు: ఆర్టీసీ ద్వారా జిల్లాలో ప్రజలకు పూర్తిస్థాయిలో రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. జిల్లాలోని 22 మండలాల్లో బస్సు సర్వీసుల సంఖ్య పెంచడంతో పాటు సరిహద్దు ఒడిశాలోని ప్రధాన ప్రాంతాలకు అంతరాష్ట్ర సర్వీసులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు కసరత్తు మొదలుపెట్టారు. సీలేరులో శాటిలైట్ డిపోతో పాటు పాడేరు డిపోలో అదనంగా బస్సు సర్వీసులు, ఆర్టీసీ కాంప్లెక్స్‌ల అభివృద్ధి తదితర అంశాలపై దృష్టి పెట్టారు.

అదనపు బస్సులు

పాడేరులో ఆర్టీసీ డిపోను 1987లో ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి అభివృద్ధి అంతంతమాత్రంగానే ఉంది. గత ఏడాది పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ఏర్పాటైన తరువాత రవాణా సౌకర్యాల పెంపుపై ప్రభుత్వంతో పాటు,ఆర్టీసీ యాజమాన్యానికి కలెక్టర్ సుమిత్ కుమార్ నివేదించారు. దీంతో అదనంగా బస్సులు మంజూరు చేయడంతో పాటు కొత్త సర్వీసులు ప్రారంభానికి చర్యలు తీసుకుంటున్నారు.

పాడేరు డిపోను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ప్రస్తుతం పాడేరు డిపోలో 38 బస్సులు ఉండగా, కలెక్టర్ చొరవతో తిరుపతి డిపో నుంచి ఏడు సప్తగిరి బస్సులను పాడేరు డిపోకు రప్పించారు. వీటిని అరకులోయ, ముంచంగిపుట్టు రూట్‌లతో పాటు చింతూరు, రంపచోడవరానికి నడిపేందుకు నిర్ణయించారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ముగియగానే ఇవి అందుబాటులోకి రానున్నాయి. అదనంగా ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు గాను కొత్త బస్సులు కూడా పాడేరు డిపోకు రానున్నాయి.

మూడు ఎకరాల్లో డిపో

జిల్లాలోని చివరన ఉన్న సీలేరు ప్రాంతంలో శాటిలైట్ డిపో ప్రారంభానికి ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మూడు ఎకరాల విస్తీర్ణంలో డిపోను నిర్మించనున్నారు.10 బస్సులతో డిపోను ఈనెలాఖరులో ప్రారంభించే లక్ష్యంతో ప్రభుత్వం ఉంది. సీలేరు శాటిలైట్ డిపో ద్వారా సీలేరు నుంచి రంపచోడవరం, చింతపల్లి, చింతూరు, ఎటపాక రూట్లలో బస్సులు నడపనున్నారు. అంతరాష్ట్ర సర్వీసులకు అనుమతి రాగానే సీలేరు డిపో నుంచి సరిహద్దులోని ఒడిశా రాష్ట్రంలోని చిత్రకొండ, మల్కన్‌గిరి ప్రాంతాలకు, పాడేరు డిపో నుంచి పెదబయలు మీదుగా ఒడిశాలోని పాడువా నుంచి అరకులోయకు బస్సులు నడపనున్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌ల ఆధునికీకరణ

పాడేరుతో పాటు అరకులోయ, చింతపల్లి, అడ్డతీగల, జి.మాడుగుల, పెదబయలు, రంపచోడవరంలోని ఆర్టీసీ కాంప్లెక్స్‌ల ఆధునికీకరణకు అధికారులు చర్యలు ప్రారంభించారు. కాంప్లెక్స్‌లలో ప్లాట్‌ఫారాల సంఖ్య పెంచడంతో పాటు ప్రయాణికులకు పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించే ప్రణాళికలకు ఆర్టీసీ యాజమాన్యం ఆమోదించింది.



పాడేరు ఆర్టీసీ డిపో

మరింతగా సేవలు



జిల్లాలోని 22మండలాలకు రవాణా సౌకర్యాలను విస్తరిస్తున్నాం. పాడేరు,రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలో ఆర్టీసీ బస్సు సేవలు అధికం కానున్నాయి.పాడేరు డిపో ఆధ్వర్యంలో సీలేరులో శాటిలైట్ ఆర్టీసీ డిపోను త్వరలో 10 బస్సులతో ప్రారంభిస్తున్నాం. చింతూరు,రంపచోడవరం ప్రాంతాల్లోని ప్రజలకు సీలేరు నుంచి రవాణా వ్యవస్థ పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తుంది. పాడేరు డిపో నుంచి పలు రూట్లలో అదనంగా బస్సులను నడుపుతున్నాం.ఆర్టీసీ కాంప్లెక్స్‌ల్లో ప్రయాణికులకు సౌకర్యాలను మెరుగుపరుస్తున్నాం.

– ఆర్.సీతారాం నాయుడు, ఆర్టీసీ డిపో మేనేజర్, పాడేరు

క్లుప్తంగా

జ్వరంతో మూడు నెలల శిశువు మృతి



విలపిస్తున్న దీన కుమారి

రాజవొమ్మంగి: మండలంలోని దూసరపాము గ్రామానికి చెంది పావడ సాయి దీనాకుమారి అనే గిరిజన మహిళకు తొలికాన్పులో పుట్టిన పాప(మూడు నెలలు) సోమవారం మరణించింది. పాపకు ఆదివారం ఉదయం జ్వరం వచ్చి ఫిట్స్ రావడంతో వెంటనే రాజవొమ్మంగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడ ప్రథమచికిత్స అనంతరం వైద్యులు పాపను కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మరణించినట్టు తల్లి కుమారి విలపిస్తూ తెలిపింది. గత ఏడాది డిసెంబర్ 15న పాప జన్మించిందని, అప్పటి నుంచి ఆరోగ్యంగా ఉన్న పాపకు జ్వరం వచ్చి చనిపోయిందని కుమారి తెలిపింది. దీనిపై రాజవొమ్మంగి పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ శ్రీదుర్గను సంప్రదించగా పడుకొని పాలు పట్టడం వల్లే ఊపిరితిత్తుల్లోకి పాలు వెళ్లి ఊపిరి ఆడక పాప చనిపోయిందని చెప్పారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ సుధాకర్

పాడేరు రూరల్: మండలంలోని చింతలవీధి పంచాయతీ కుమ్మరి పుట్టు గ్రామ శివార్లో సోమవారం సాయంత్రం ఓ గుర్తు తెలియని మృతదేహం అస్తి పంజరం లభ్యమైంది. ఈ సంఘటన స్థానికంగా కలకలం సృష్టించింది. గ్రామ శివార్లో మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు విషయాన్ని పంచాయతీ వీఆర్వో తెలిపారు. వీఆర్వో పాడేరు ఎస్‌ఐ లక్ష్మణ్‌కు సమాచారమిచ్చారు. పాడేరు సీఐ సుధాకర్, ఎస్‌ఐ లక్ష్మణ్, పోలీసు సిబ్బంది, క్లూస్ టీంతో సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి అస్తిపంజరం మిగిలిఉంది. ఈ సంఘటనను అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. మూడు నెలల క్రితం అదృశ్యమైన కుమ్మరి పుట్టు నివాసి ఉపాధ్యాయుడు పాంగి వెంకటరమణగా కుటుంబ సభ్యులు అనుమానిస్తున్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి వివరాలు వెల్లడిస్తామని సీఐ తెలిపారు.

నులిమేద్దాం!

- నేడు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ
- 60 శాతం చిన్నారుల్లో రక్తహీనతకు నులిపురుగే కారణం
- జిల్లాలో 3,07,839 మందికి మాత్రలు వేయాలని లక్ష్యం

దేశంలో 19 ఏళ్లలోపు వయసున్న పిల్లలు సాయిల్ ట్రాన్స్‌మిటెడ్ హెల్మిన్స్(ఎస్‌టీహెచ్) ద్వారా సంక్రమించే ఇన్ఫెక్షన్ల వల్ల ఎక్కువగా రక్తహీనతకు గురవుతున్నారు. నేషనల్ హెల్త్ పోర్టల్(ఎన్‌హెచ్‌పీ) నివేదిక మేరకు ఆరు మాసాల నుంచి ఆరేళ్ల వయసున్న ప్రతి 10 మంది పిల్లల్లో ఏడుగురికి రక్తహీనత ఉంది. దీన్ని నియంత్రించడానికి 2015 నుంచి ఏటా ఫిబ్రవరి, ఆగస్టులో నులిపురుగుల నివారణ (డీవార్మింగ్) కార్యక్రమాలు పకడ్బందీగా చేపడుతున్నారు. అందులో భాగంగా నేడు(మంగళవారం) జిల్లా వ్యాప్తంగా నులి పురుగుల్ని నివారించే ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు.

సాక్షి, పాడేరు : పెరుగుతున్న రక్తహీనత కేసులతో జనం అల్లాడిపోతున్నారు. ఎంత మంచి ఆహారం తీసుకున్నా.. రక్తహీనతకు గురయ్యేవారి కారణాలు తెలిస్తే మన మీద మనకే జాలేస్తుంది. కొద్ది పాటి నిర్లక్ష్యం, వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత లోపించి చిన్నారులకు, గర్భిణులకు శాపంగా మారుతోంది. కరోనా తర్వాత శుభ్రతపై కాస్త దృక్పథం మారినా.. పిల్లల్లో మాత్రం నులిపురుగుల వ్యాప్తికి మన నిర్లక్ష్యమే కారణమవుతోంది. పిల్లల్లో రక్తహీనతకు కారణమవుతున్న నులిపురుగుల నివారణకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ సర్వం సన్నద్ధమయింది.

నులిపురుగులతో నష్టాలు

నులిపురుగులు పేగుల్లోని రక్తాన్ని పీల్చి, వృద్ధి చెందుతాయి. దీంతో రక్తహీనత కలిగి, నీరసించిపోతారు. ఆయాసం, దగ్గుతో ఇబ్బంది పడతారు. పిల్లల బరువుతోపాటు ఎదుగుదల తగ్గిపోతుంది. చర్మంపై దద్దుర్లు రావొచ్చు. తరచూ కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు, తలనొప్పి, ఆకలి మందగించడం తదితర లక్షణాలు వేధిస్తాయి. చదువులో ఏకాగ్రత లోపించి, నేర్చుకునే సామర్థ్యం తగ్గిపోతుంది. పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రత పాటిస్తే వీటిని చాలా వరకు నివారించవచ్చు.

నులిపురుగుల వ్యాప్తి కారకాలు

- కలుషిత, ఈగలు వాలిన పదార్థాలు తినడం వల్ల పొట్ట, పేగుల్లోకి నులిపురుగులు చేరే అవకాశాలు ఎక్కువ.
- వ్యక్తిగత పరిశుభ్రత లోపించి చేతి గోళ్ల ద్వారా కూడా ఇవి వ్యాపిస్తాయి.
- బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన, చెప్పుల్లేకుండా మరుగుదొడ్ల వాడకం ద్వారా శరీరంలోకి నులిపురుగులు ప్రవేశిస్తాయి.
- అపరిశుభ్ర ఇంటి పరిసరాల్లో పిల్లలు ఆడుకునేటపుడు వాటి లార్వాలు జీర్ణకోశంలోకి ప్రవేశించి నులిపురుగులు వ్యాపిస్తాయి.
- మన దేశంలో 50–60 శాతం మంది ప్రధానంగా ఏలికపాములు, నులిపురుగులు, కొంకిపురుగుల వల్లే రక్తహీనకు గురవుతున్నట్టు అంచనా.

మాత్రల డోసేజ్

పిల్లల్లో అనారోగ్యానికి కారణమవుతున్న నులిపురుగుల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే రాష్ట్రీయ బాల స్వస్థ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఈ నెల 14(మంగళవారం) నులిపురుగుల నివారణ దినోత్సవం పేరిట ప్రతి చిన్నారికి ఆల్బెండజోల్ మాత్రను అందించనుంది. ఏడాది నుంచి ఐదేళ్లలోపు చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా, ఆరేళ్ల నిండి 19 ఏళ్ల వయసున్న వారికి స్కూళ్లు, కాలేజీల్లో మాత్రల పంపిణీకి చర్యలు తీసుకున్నారు. ఏడాది నుంచి రెండేళ్ల వయసున్న చిన్నారులకు 200 మి.గ్రా.(సగం)మాత్ర, రెండేళ్ల నుంచి 19 ఏళ్ల వయసు వారికి 400 మి.గ్రా. మాత్ర చొప్పున మింగాల్సి ఉంటుంది.



నులిపురుగు నివారణ మాత్రలు

జిల్లాలో పంపిణీ నేడు

అల్లూరి జిల్లాలో 22 మండలాల్లో 19 ఏళ్ల వయసున్న వారు 3,07,839 మంది పిల్లలున్నారు. వీరందరికీ మంగళవారం ఆల్బెండజోల్ మాత్రల పంపిణీకి సుమారు 3952 మంది ఆశ కార్యకర్తలు,464 మంది ఏఎన్‌ఎంలు పాల్గొంటున్నారు. ఈ సారి విద్యాశాఖను సైతం భాగస్వామ్యం చేశారు. గతంలో నేరుగా ఆశా కార్యకర్తల ద్వారా మాత్రలను పాఠశాలల్లో వేసేవారు. ఇప్పుడు విద్యాశాఖ సిబ్బంది ద్వారా అందించేందుకు విద్యాసంస్థలకు రెండు రోజులు ముందుగానే మాత్రల్ని చేర్చారు. తల్లిదండ్రులకు, పిల్లలకు వీటిపై ముందుగానే అవగాహన కల్పించేలా వైద్యశాఖ చర్యలు తీసుకుంది.



నులిపురుగులు

వీరికి మాత్రలొద్దు

పూర్తిగా అనారోగ్యంతో ఉన్న వారు ఆల్బెండజోల్ మాత్ర వేసుకోరాదు. పూర్తిగా కోలుకున్న తర్వాతే వేసుకోవాలి. ఏడాదిలోపు వయసున్నవారు, గర్భిణులు, బాలింతలు, లివర్, ఉదర, గుండె సంబంధిత వ్యాధులున్నవారు ఈ మాత్రల్ని వేసుకోరాదు.

మాత్రలు తప్పనిసరి



అల్లూరి జిల్లాలో అన్ని పాఠశాలలకు ఈ మాత్రలు ఇప్పటికే సరఫరా చేశాం. ఖచ్చితంగా ప్రతి పిల్లవాడు ఈ మాత్ర వేసుకోవాలి. ఎటువంటి ఇబ్బందులు ఉన్నా.. వైద్య సిబ్బంది పక్కనే అందుబాటులో ఉంటుంది. నులి పురుగుల నియంత్రణకు తల్లిదండ్రులు సహకరించాలి. పిల్లలతో మాత్రల్ని మింగించాలి.

– డాక్టర్ జమాల్‌బాషా, డీఎంహెచ్‌వో

కొత్తపల్లిలో రెండు తాటాకు ఇళ్లు దగ్ధం

రూ.రెండు లక్షల ఆస్తి నష్టం



కట్టుబట్టలతో మిగిలిన శ్రీనివాస్ కుటుంబం

కొయ్యూరు: అంతాడ పంచాయతీ కొత్తపల్లిలో ఆదివారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు తాటాకుల ఇళ్లు పూర్తిగా కాలిపోయాయి. బాధితులు కట్టుబట్టలతో మిగిలారు. రూ.రెండు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. షార్ట్ సర్క్యూట్‌తో ఒకేసారి మంటలు వ్యాపించడంతో ఎండిపోయిన తాటాకుల నుంచి ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. వాటిని అదుపు చేయడం సాధ్యం కాలేదు. దీని మూలంగా బాధితులు రీమలు శ్రీనివాస్, రాటా మంగలకు చెందిన రెండు ఇళ్లు కాలిపోయాయి. బట్టలు, వంట పాత్రలతో సహా ఇతర వస్తువులు కూడా పూర్తిగా కాలిపోయాయని బాధితులు ఆవేదన చెందారు. రాత్రి సమయం కావడంతో మంటలను అదుపు చేయడం సాధ్యం కాలేదని తెలిపారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని చింతపల్లి ఏఎంసీ చైర్మన్ రాజులమ్మ, సర్పంచ్ సుర్ల చంద్రరావు తెలిపారు. రెవెన్యూ అధికారులు గ్రామాన్ని సందర్శించి ఆస్తి నష్టాన్ని అంచనా వేశారు.

వరిగడ్డితో ట్రాక్టర్ దగ్ధం

చోడవరం రూరల్: వరిగడ్డి లోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌కు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా సంభవించిన అగ్ని ప్రమాదంలో వరిగడ్డితో పాటు, ట్రాక్టర్ దగ్ధమయ్యింది. ఈ ప్రమాదంలో ఇరవై లక్షల రూపాయల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని అంచనా. చోడవరం పట్టణ శివారు అన్నవరం సమీపంలో సోమవారం మధ్యాహ్నం చోటుచేసుకున్న ప్రమాదం వివరాలిలా ఉన్నాయి. చీడికాడ మండలం చుక్కపల్లి గ్రామానికి చెందిన అద్దెపల్లి పాలకు చెందిన ట్రాక్టర్‌లో అన్నవరం గ్రామానికి చెందిన కందుల వెంకటరావు వరిగడ్డిని తరలిస్తున్నారు. ట్రాక్టర్ అన్నవరం సమీపంలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రాంతానికి వచ్చేసరికి ట్రాక్టర్‌పై ఉన్న వరిగడ్డి విద్యుత్ తీగలను తాకింది. దీంతో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ అయి నిప్పురవ్వలు రాలడంతో ఎండిఉన్న వరిగడ్డికి నిప్పంటుకుంది. క్షణాల్లో మంటలు ఎగసిపడడంతో ట్రాక్టర్ ఇంజిన్‌ను వేరుచేయడానికి వీలు పడలేదు. ప్రమాద సమాచారం అందుకున్న చోడవరం అగ్నిమాపక సిబ్బంది ప్రమాదస్థలికి చేరుకుని మంటలను అదుపు చేశారు. అయితే అప్పటికే ట్రాక్టర్ మంటల్లో కాలిపోయింది.



దగ్ధమవుతున్న ట్రాక్టర్

కారు ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి

నక్కపల్లి: జాతీయరహదారిపై ఒడ్డిమెట్ట, గొడిచర్ల సమీపంలో ఆదివారం అర్ధరాత్రి కారు ఢీకొనడంతో గుర్తు తెలియని మహిళ మృతి చెందింది. ఈ మహిళను కారు ఢీకొట్టి పరారయింది. తీవ్రంగా గాయపడిన ఆమెను 108 సిబ్బంది తుని ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో ఆమెను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించిందని పోలీసులు తెలిపారు. పరారైన కారును పోలీసులు పట్టుకున్నారు.



మృతి చెందిన మహిళ

మృతురాలి వయసు 40 నుంచి 45 ఏళ్ల మధ్య ఉంటుంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శిరీష తెలిపారు.

క్షయ,కుష్టు వ్యాధులపై అప్రమత్తం

ముంచంగిపుట్టు: క్షయ,కుష్టు వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా క్షయ,కుష్టు,ఎయిడ్స్ వ్యాధుల నివారణ అధికారి డాక్టర్ తమర్బ విశ్వేశ్వరనాయుడు తెలిపారు. మండలంలో గల కిలగాడ పీహెచ్‌సీ,ముంచంగిపుట్టు సీహెచ్‌సీలను సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు.గ్రామాల్లో అందిస్తున్న వైద్య సేవలు,ఆరోగ్య శిబిరాలపై వైద్య సిబ్బందిని అడిగారు. అనంతరం రోగులతో మాట్లాడారు. ముంచంగిపుట్టులోని ఎస్‌ఎన్‌సీయూను తనిఖీ చేసి, పసిపిల్లల ఆరోగ్య సంరక్షణపై వైద్యులను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడతూ క్షయ వ్యాధి నివారణకు ప్రత్యేక వైద్యం అందజేస్తున్నట్టు చెప్పారు. క్షయ,కుష్టు వ్యాధులను ముందుగానే గుర్తిస్తే వైద్యులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌సీ డాక్టర్ మౌనిక,ఎల్‌టీ భాస్కర్,ఎంపీహెచ్‌వో ప్రసాద్‌రావులు పాల్గొన్నారు.



పెదబయలులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ విశ్వేశ్వరనాయుడు



కిలగాడ పీహెచ్‌సీలో రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

పెదబయలు: డివార్మింగ్‌డేను విజయవంతం చేయాలని జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ టి.విశ్వేశ్వర నాయుడు అన్నారు.సోమవారం పెదబయలు పీహెచ్‌సీని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14ర జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. పెదబయలు పీహెచ్‌సీలో క్షయ రోగులు వివరాలు, వారికి అందించే కిట్లపై సిబ్బందికి అడిగి తెలుసుకున్నారు. స్థానిక వైద్యాధికారులు డాక్టర్ సిందూరం పడాల్, డాక్టర్ రమ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్న హత్య కేసులో భర్తకు పదేళ్ల జైలు

పాయకరావుపేట: పట్టణంలో గల చాకలిపేటకు చెందిన గోగులపాటి దావీదుకు వరకట్నం వేధింపుల కేసులో 10 సంవత్సరాల జైలు శిక్ష విధిస్తూ విశాఖపట్నం అదనపు జిల్లా జడ్జి పి.గోవర్ధన్ సోమవారం తీర్పు చెప్పినట్టు సీఐ పి.అప్పలరాజు తెలిపారు. 2013లో నిందితుడు తన భార్యను వరకట్నం కోసం వేధించి గొంతు నులిమి చంపినందుకు పెట్టిన కేసులో శిక్ష విధించడం జరిగిందన్నారు. శిక్షతో పాటు 2 వేల రూపాయలు జరిమానా కూడా విధించడం జరిగిందని సీఐ తెలిపారు.

సీఆర్‌పీఎఫ్ సేవలు



పేదలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న పీఆర్‌పీఎఫ్ డి42-బెటాలియన్ పోలీసులు

వై.రామవరం: సివిక్ యాక్షన్ ప్రోగ్రాంలో భాగంగా వై.రామవరంలో సోమవారం సీఆర్‌పీఎఫ్–డి42 బెటాలియన్ పోలీసుల ఆధ్వర్యంలో పేదలకు భోజనం సమకూర్చారు. ఒకపక్క వారపు సంతకు, మరో పక్క ప్రభుత్వ కార్యాలయాల పనులపై వచ్చిన సుమారు 170 మందికి భోజనం ప్యాకెట్లు పంపిణీ చేసారు. అసిస్టెంటు కమాండెంటు ఎం.ఎల్.నాయుడు, ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

సుధాకర్ విజయం ఖాయం



పార్టీ నాయకులతో మాట్లాడుతున్న అరకు ఎమ్మెల్యే పాల్గుణ

అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ

డుంబ్రిగుడ: వైఎస్సార్‌సీపీ బలపరచిన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ గెలుపు ఖాయమని అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ అన్నారు. డుంబ్రిగుడ మండల కేంద్రంలో ఆదివారం పర్యటించిన ఆయన పార్టీ నాయకులతో మాట్లాడి పోలింగ్ సరళి గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే సీతంరాజు సుధాకర్‌ను గెలిపిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బాక ఈశ్వరి,జెడ్పీటీసీ జానకమ్మ, ఎంపీటీసీలు విజయ,వరహాలమ్మ,సర్పంచ్‌లు వెంకటరావు ,నాగేశ్వరరావు, శారద,అర్జున్,సుబ్బారావు, ఎంపీటీసీలు విజయ,రామారావు, వైఎస్సార్‌సీపీ మండల మహిళా అధ్యక్షురాలు శాంతి,నాయకులు బాక సింహాచలం , లీలారాణి, సచివాలయ కన్వీనర్ గణపతి,మాజీ జెడ్పీటీసీ శ్రీరాములు పాల్గొన్నారు.

తమ్ముడిని ట్రాక్టర్‌తో ఢీకొట్టిన అన్న

రావికమతం: అన్నదమ్ముల మధ్య కొన్నాళ్లుగా నలుగుతున్న భూ వివాదం సోమవారం తీవ్ర రూపం దాల్చింది. ఈ వివాదంలో అన్నకు ఆగ్రహం కట్టలు తెంచుకుంది. దీంతో ఏకంగా బైక్‌పై వస్తున్న తమ్మునిపై ట్రాక్టర్‌తో ఢీకొని హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్రగాయాల పాలయిన తమ్ముడిని రావికమతం ఆస్పత్రి నుంచి నర్సీపట్నం ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. రావికమతం ఎస్‌ఐ ఉమా మహేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. వివరాలివి. అప్పలమ్మపాలెం గ్రామానికి చెందిన అన్న మడకా రమణ, తమ్ముడు సింహాద్రినాయుడుకు మధ్య కొంత కాలంగా ఆస్తి వివాదాలు ఉన్నాయి. పలుమార్లు ఇద్దరూ గొడవ పడ్డారు. ఈ క్రమంలో సోమవారం మధ్యాహ్నం మేడివాడ గ్రామం పనిమీద వచ్చి తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తున్న సింహాద్రినాయుడును ఎదురుగా ట్రాక్టర్‌పై వస్తున్న అతని అన్న ట్రాక్టర్‌తో ఢీకొట్టాడు. దీంతో సింహాద్రి నాయుడు కింద పడడంతో చేతికి, ఒంటికి తీవ్ర గాయాలయ్యాయి. బైక్ ట్రాక్టర్ కింద నలిగిపోయింది. గాయాల పాలైన అతనిని రావికమతం ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు చేయించి ఆపై నర్సీపట్నం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



ట్రాక్టర్‌కింద నలిగి ఉన్న సింహాద్రినాయుడు బైక్

చిరుధాన్యాలతో అపు‘రూపాలు’

- చిత్రవిచిత్రాలతో మెప్పిస్తున్న విజయ్‌కుమార్
- దేశ, విదేశీ ప్రముఖులను మెప్పించిన వైనం

ఏయూక్యాంపస్ : వృత్తిరీత్యా అతను రైల్వేలో గ్రేడ్ వన్ టెక్నీషియన్‌గా బాధ్యతలను నిర్వహిస్తున్నారు. చిన్నతనం నుంచి చిత్రకళపై ఉన్న ఆసక్తితో చిత్రకారుడిగా మారారు. విభిన్న రూపాలను హృద్యంగా కుడ్యంపై తీర్చిదిద్దడం అతని ప్రత్యేకత, విశాఖకు చెందిన మోకా విజయ్ కుమార్‌ది చిత్రకళలో అందెవేసిన చేయి. సాధారణ చిత్రకారుడిగా ఉండకుండా తనకంటూ ఒక ప్రత్యేకత, గుర్తింపును సంపాదించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇందులో భాగంగా తాజాగా చిరుధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను ఎంతో వ్యయ ప్రయాసలకోర్చి తీర్చిదిద్ది శభాష్ అనిపించుకున్నారు.

సిరిధాన్యాలతో చిత్తరువులు

2023 సంవత్సరాన్ని ఐక్యరాజ్య సమితి చిరుధాన్యాల సంవత్సరంగా ప్రకటించింది. ప్రజలకు చిరుధాన్యాలపై విస్తృత అవగాహన కల్పించే విధంగా విజయ్ కుమార్ ఆలోచించారు. సిరిధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను తీర్చిదిద్దే ప్రయత్నం చేశారు. జొన్నలు, అరికలు, గంట్లు, రాగులు, నువ్వులు ఉపయోగించి ప్రధాని నరేంద్ర మోదీ, ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్‌మోహన రెడ్డిలతో పాటు, ముఖేష్ అంబాని, ఆనంద్ మహేంద్ర, సత్యానాదెండ్ల, ఆదానీ, నటరాజన్ చంద్రశేఖరన్, సుందర్‌పిచాయ్, ఆది గోద్రెజ్, కుమార మంగళం బిర్లా, ఎలాన్ మస్క్, టిం కుక్ వంటి అంతర్జాతీయ సంస్థల సీఈవోల చిత్రపటాలను తీర్చిదిద్దారు. ఎటువంటి వర్ణాలు అద్దకుండా కేవలం చిరుధాన్యాల గింజలను ఉపయోగించి ఎంతో ఆకర్షణీయంగా వీటిని తయారు చేశారు. ఒక్కో చిత్రపటం తయారు చేయడానికి పక్షం రోజులకు పైగా పట్టిందని విజయ్ కుమార్ చెప్పారు.



ముఖ్యమంత్రికి చిత్రపటం బహూకరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో..

విశాఖలో ఇటీవల జరిగిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో విజయ్ కుమార్ తయారు చేసిన ప్రముఖుల చిత్రపటాలను ప్రదర్శించారు. రాష్ట్ర మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్, గుడివాడ అమర్‌నాథ్‌లు వీటిని పరిశీలించి విజయ్‌కుమార్‌ను అభినందించారు. అనంతరం ముఖ్యమంత్రి చిత్రపటాన్ని స్వయంగా మంత్రి గుడివాడ అమర్‌నాథ్ విజయవాడ తీసుకువెళ్లి ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్ మోహన రెడ్డికి బహూకరించారు.

విదేశాలలో ప్రదర్శనలు

2017లో తానా వారి ఆహ్వానం మీద అమెరికాలో సెయింట్ లూయిస్‌లో విజయ్ కుమార్ ప్రత్యేక ప్రదర్శన ఇచ్చారు. 2019 అట్లాంటాలో చిత్రకళను చిన్నారులకు 45 రోజులు బోధించారు. 2021లో ఆన్‌లైన్‌లో అమెరికా, భారతీయ విద్యార్థులకు చిత్రకళపై ఆన్‌లైన్‌లో ప్రత్యేక తరగతులను నిర్వహించారు. 2022లో న్యూజెర్సీలో తెలంగాణ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో అమెరికాలో ప్రత్యేక ప్రదర్శన, శిక్షణ తరగతులను విజయ్‌కుమార్ నిర్వహించారు. రైల్వే కార్యాలయంలో పలు ప్రాంతాలను తన చిత్రాలతో కళాత్మకంగా గతంలో తీర్చిదిద్దారు.

కొత్తగా ప్రయత్నించా...



ప్రజల్లో అవగాహన కల్పించాలని, చిరుధాన్యాలపట్ల ప్రజల్లో చైతన్యం పెంచే విధంగా ఈ ప్రయత్నించా..కాదేదీ కళలకు అనర్హం అన్న చందంగా చిరుధాన్యాలను ఉపయోగించి ప్రముఖుల చిత్రాలను తయారు చేశా. వీటిని మంత్రులు వీక్షించి ప్రశంసించారు. భవిష్యత్తులో సమాజానికి సందేశాన్నందించే మంచి చిత్రాలను తీర్చిదిద్దుతా..

– మోకా విజయ్ కుమార్, చిత్రకారుడు